కథానిక




# కన్నీటి అంచుల్లో కడలి

పంతం సుజాత

ప్రపంచం చాలా బావుంది. స్వర్గం నా ఎదురుగానే ఉంది. నా శరీరం రోమాంచితమవుతోంది. నా మాతృదేశాన్ని, నా జన్మభూమిని, నా కన్నతల్లిని ఎన్నాళ్ళకెన్నాళ్ళకు నా తల్లి ఒడిని చేరగలుగుతున్నాను. ట్రైన్ వేగంగా కదులుతోంది. అంతకంటే వేగంగా నా ఆలోచనలు పరుగెడుతున్నాయి. చెట్లు వెనక్కి పరుగెడుతున్నాయి. ఎప్పుడో 30 ఏళ్ళ క్రితం వదిలిపెట్టిన ఊరు ఎలా ఉందో ఇప్పుడు.

నిడదవోలు స్టేషన్‌లో ట్రైన్ ఆగింది. అబ్బ ఇంకా రెండు స్టేషన్లు దాటాలి. నా జీవితంలో అత్యంత భారంగా గడిచిన సమయం ఇదేనేమో. అమెరికాలో ఫ్లైట్ ఎక్కింది మొదలు ఇప్పటివరకూ కాలం గడవడం లేదు. ఎంతకీ నా ఊరు రాదేం. ఊరు రాలేదు కానీ గోదావరి వచ్చింది. కోనసీమని తాకుతూ కోటిపల్లి మీదుగా కాకినాడ సముద్రంలో కలిసే గోదావరి నిండుగా పారుతోంది. కొత్తనీరు వచ్చినట్టుంది. చెంగావిరంగు చీరలో ముత్తయిదువలా గోదావరి ఉంది. అప్రయత్నంగా రెండు చేతులూ ఎత్తి నమస్కరించాను. నీళ్ళమీద పడ్డ సూర్యకిరణాలు మెరుస్తుంటే, బంగారు గుళ్ళు దొర్లుతున్నట్టుగా ఉంది.

ధడధడా శబ్దం చేసుకుంటూ ట్రైన్ గోదావరి బ్రిడ్జ్ దాటి రాజమండ్రి స్టేషన్‌లో ఆగింది. నా మనసంతా చుట్టూ ఉన్న గోదావరి స్థితిని పట్టించుకునేలా లేదు. ఒక్కటే ఆలోచన. డిస్టర్బ్ అవ్వడం ఇష్టంలేక కళ్ళుమూసుకున్నాను. ఎంత టైం గడిచిందో తెలీదు.

"మాస్టారూ ద్వారపూడి స్టేషన్ వచ్చింది" ఎదుటి బెర్త్‌లో ఉన్న ఆయన తట్టి లేపాడు. ఉలిక్కిపడి లేచి కూర్చున్నాను.

"త్వరగా దిగండి. ఎక్కువసేపు ఆగదు ట్రైన్". తిరిగి ఆయనే హెచ్చరించాడు. 'థ్యాంక్స్' చెప్పి లగేజ్ తీసుకుని గబగబా దిగేశాను. ట్రైన్ వెళ్ళిపోయింది. అక్కడి నుండి బస్‌లో వెళ్ళాలి. ఓ పది కిలోమీటర్ల దూరంలో ఉన్న చిన్న పల్లెటూరు మాది. చుట్టూ చూశాను.

నేను అమెరికా వెళ్తున్నప్పుడు వీడ్కోలు ఇచ్చిన మిత్రమండలి గుర్తొచ్చింది. ఎక్కడున్నారో, ఎలా ఉన్నారో అనుకుంటూ బస్టాండ్‌కి చేరుకున్నాను.

చిన్న పళ్ళాన్ని అరచేతిలో పెట్టుకుని. దాన్నిండా చెగోడీ పొట్లాలు వేసుకుని అమ్ముతున్నాడో కుర్రాడు. ద్వారపూడి స్పెషల్ అవి. చాలా బావుంటాయి. ఆ కుర్రాడిని పిలిచి మొత్తం కొనేశాను. బ్యాగ్‌లో వేస్తుంటే చిన్నప్పుడు జరిగిన సంఘటన గుర్తొచ్చింది.

◐ ◐ ◐

చిన్నత్త పెళ్ళికి బస్‌లో అందరం అన్నవరం వెళ్తున్నాం. నేను అమ్మ పక్కనే కూర్చున్నాను. ద్వారపూడి రాగానే చెగోడీలు అమ్మొచ్చాయి. అవి కావాలని నేను పేచీ పెట్టాను. అమ్మ విసుక్కుంటూ చెగోడీల వాడి వైపు తిరిగి "అబ్బాయ్ రెండు పొట్లాలివ్వు" అంది. వాడు వెంటనే రెండు పొట్లాలు తీసి నా చేతిలో పెట్టాడు. అమ్మ పర్సులోంచి డబ్బు తీస్తుండగా బస్ కదిలిపోయింది. నాకు ఒకటే కంగారు. వాడు వెనకాలే పరుగెత్తుకొస్తున్నాడు.

"అమ్మా త్వరగా డబ్బులు తియ్యవే విసిరేస్తాను" వెనక్కి తిరిగి చూస్తూ అన్నాను.

"చిల్లర లేదురా, పది రూపాయల కాగితం ఇస్తే తిరిగి చిల్లరెలా వస్తుంది. బస్సు ఆగదు" దీర్ఘం తీస్తూ అంది అమ్మ.

మొత్తంమీద వాడికి డబ్బు అందలేదు. బస్ వెనకే ఆశగా పరుగెత్తుకొచ్చిన వాడి ముఖం నాకిప్పటికీ గుర్తే. పై పెదవి మీద గ్రహణం మొర్రు, మెల్లకన్ను వింతగా ఉన్నాడు. నా చేతిలో చెగోడీ పొట్లాలు చూస్తే వాడి జాలి ముఖమే గుర్తొచ్చి తినబుద్ధి కాలేదు. ఎవరికో ఇచ్చేశాను.

"కొనే వరకూ నా ప్రాణాలు తీశావు కదరా" అంటూ విసుక్కుంది అమ్మ. కానీ వాడికి డబ్బులివ్వలేదని కించిత్ కూడా బాధపడలేదు.

◐ ◐ ◐

"ధర్మం బాబూ" ఎవరో పిలుస్తున్నట్లయి ఆలోచనల్లోంచి తెప్పరిల్లి చూశాను.

చక్రాల పీట మీద కూర్చుని ఓ వృద్ధుడు అడుక్కుంటున్నాడు. డబ్బులు వేద్దాం అనుకుంటుండగా బస్సొచ్చి ఆగింది. బిలబిలమంటూ అందరూ పరుగెత్తారు. వాళ్ళతోపాటు నేను వెళ్ళాను. మెట్లెక్కుతుండగా ఆ ముసలాడి ముఖమే నా కళ్ళల్లో కదలాడసాగింది.

వాడి కళ్ళల్లోనూ అదే ఆశ. సందేహం లేదు. వాడే ఆనాడు చెగోడీలు అబ్బాయే ఈ తాత. ఆ పై పెదవి మీద గ్రహణం మొర్రు లేకపోతే గుర్తుపట్టగలిగేవాడిని కాను. "రైట్, రైట్" అంటున్నాడు కండక్టర్.

వెళ్ళిపోనీ, ఈ బస్ కాకపోతే ఇంకొకటి. కానీ ఒకసారి చేసిన తప్పు ఇంకోసారి చేయను. బస్ దిగి తాత దగ్గరికి నడిచాను. గుప్పెటకి వచ్చినంత డబ్బు తీసి అతని దోసిట్లో పోశాను. ఆ తాత ముఖంలో ఫీలింగ్స్ చూడడం అనవసరం అనిపించింది. వెనక్కి తిరిగాను. ఆ దృశ్యం చూసిన కండక్టర్ నా కోసం బస్సు ఆపేశాడు. మా ఊర్లో దిగేవరకూ నన్ను దేవుడిలాగానే అందరూ చూశారు.

◐ ◐ ◐

ఊళ్ళోకి అడుగు పెట్టగానే షూస్ తీసేసి ఒట్టి కాళ్ళతో నేలపై నడవాలన్న కోరికని బలవంతంగా అణుచుకున్నాను. అణువణువూ పులకించిపోతోంది. శరీరం గాల్లో తేలిపోతోంది. ప్రతిచోటికీ నా మనసు పరుగులు తీస్తోంది. అంతా ఒకేసారి చుట్టేయాలన్న ఆరాటం నా బాల్యాన్ని పొత్తిళ్ళలో దాచుకున్న ఊరు. చదువు నేర్పిన స్కూలు. ఈ మట్టిలోనే కలిసిపోయిన అమ్మా నాన్న. అన్నీ, అందరూ గుర్తొస్తున్నారు.

నా హోదా, పరపతి, వయస్సు ఏదీ అడ్డం రాకుండా మా వాళ్ళ దగ్గర నేను మామూలుగా ఉండగలిగేలా చూడు స్వామి అని భగవంతుని వేడుకున్నాను.

గుమ్మంలో నన్ను చూసి తమ్ముడు ఆశ్చర్యపోయాడు. ఆనందంగా ఎదురొచ్చాడు. చేతులు చాచి, అంతలోనే సంశయంగా వెనక్కి తీసేసుకున్నాడు. నేనే ఎదురెళ్ళి వాడిని కావలించుకున్నాను. "అన్నయ్యా!" అంటూ ఏడ్చేశాడు వాడు. మిగతా వారికి విషయం తెలిసి నన్ను చుట్టేశారు.

ఈ అనుభవం కోసమే నేను వస్తున్నట్టు ఎవరికీ తెలియచెయలేదు. లేదంటే స్టేషన్ నుంచే రాచమర్యాదలు. ఓ వి‌ఐపిని చూసినట్టు చూస్తారన్న భయం. నా హోదా వాళ్ళని ఎక్కడ దూరం చేస్తుందోనన్న బెరుకు.

ఇంట్లో ఒక్కటే హడావిడి. తెలిసిన వాళ్ళందరూ చూడ్డానికి వచ్చారు. వెంకన్న తాత, సుందరమ్మత్త, ఊళ్ళోనే స్థిరపడ్డ నా స్నేహితులు అందరూ వచ్చారు. నన్ను చూసి, నాతో మాట్లాడడానికి జంకితే, నేనే ఎదురు మాట కలిపాను.

ఉన్నట్టుండి నీచు వాసన గుప్పున కొట్టింది. తమ్ముడు నా కోసం చేపలు తెప్పించినట్టున్నాడు. కొర్రమేను పులుసు. భోజనం చేసి మేను వాల్చాను. వరండాలోంచి దక్షిణం గాలి హాయిగా ఉంది. ఏ ఎసి. ఇవ్వగలదు ఈ సుఖాన్ని. మధ్యమధ్య నీచు వాసన వస్తూనే ఉంది.

● అప్పుడప్పుడు మనం ఊహించిన ఉహలన్నీ కల్లలవుతాయి.
అలాంటి సమయంలో అతనేం చేసాడు?

అన్నింటికంటే సుందర స్వప్నం ఒకటుంది. దాన్ని చూడాలంటే సాయంత్రమవ్వాలి. అప్పుడుగాని కంట బడదది. ఎప్పుడు నిద్రపట్టిందో తెలీదు. మెలుకువ వచ్చేసరికి అయిదు అయింది. నా స్వప్న సుందరిని చూడాలి అనుకుంటూ లేచాను.

"టిఫిన్ తీసుకోండి" అంటూ మరదలు పకోడీలు తెచ్చిపెట్టింది. నాకు వేటిమీదా మనసు పోవడం లేదు. నా ఆతృత వాళ్ళకేం తెలుసు. ఇంకాసే పటిలో నా కలలరాణి వెళ్ళిపోతుంది. వెళ్లాలి. ఇన్నాళ్ళుగా కోల్పోయిన ఆనందాన్ని తిరిగి పొందాలి. ఆలస్యం చేయకుండా మేడ మెట్లు ఎక్కసాగాను. కళ్ళు మూసుకుని జాగ్రత్తగా ఒక్కొక్క మెట్టే ఎక్క సాగాను. ఒక్కసారిగా చూడాలన్న కోరిక నాది. నా కళ్ళలో సంధ్య రూపం కదలాడుతూనే ఉంది.

ఎర్ర చీర కట్టుకుని, పిల్లకాలువలో మోమును చూసుకుంటూ అందానికి మెరుగులు దిద్దుకుంటున్న సంధ్య ఆమె జడలో అమరే జాజిదండ లాంటి కొంగలబారు. ఎత్తయిన చెట్లమీద రంగుల దుప్పటి కప్పిన ఆకాశం. ఆవుల్ని తోలుకొస్తున్న పశువుల కాపర్లు, గడ్డి మోస్తున్న స్త్రీలు, వెళ్ళిపోతున్న సంధ్యని వద్దని చెప్పే కొబ్బరాకు ఒక్కొక్కటే నా కళ్ళముందు కదిలిపోతున్నాయి.

మర్రి చెట్టుకి వేసిన ఊయల్లో రెండు జళ్ళ మంగ తాయారు ఊగుతూ ఉంటే ఎంత బావుండును. నా ఊహ నాకే నవ్వొచ్చింది. ఈ పాటికి అమ్మమ్మ అయిపోయి ఉంటుంది. హమ్మయ్య ఆఖరి మెట్టు ఎక్కేశాను. వచ్చేసి నా కలల సామ్రాజ్యం నా కళ్ళెదుటకు వచ్చేసింది. తడుముకుంటూ వెళ్ళి పడమర ముఖంగా నిల్చున్నాను.

కళ్ళు విప్పి చూశాను. అంతే నాలో బ్రహ్మాండం బ్రద్దలైన క్షణం. నా ఎదురుగా ఏమీ లేవు. పచ్చని చేలు లేవు. కొబ్బరి చెట్లు లేవు. పశువుల కాపర్లు లేరు. అన్నింటినీ కోల్పోయిన సంధ్య... నా స్వప్న సుందరి దిగాలుపడి ఒంటరిగా వెళ్ళిపోతోంది. వీడ్కోలు ఇవ్వడానికి కూడా ఏవీ లేవక్కడ. ఎటు చూసినా స్తబ్ధత. మానభంగానికి గురయి రోదిస్తున్న స్త్రీలా ఉంది ప్రకృతి.

ఆశకు అమ్ముడుపోయిన దుశ్శాశనులందరూ కలిసి నా నేల తల్లికి వస్త్రాపహరణం గావించారు. ఆకుపచ్చ చీరని తీసుకెళ్ళి ఎక్కడో ఏ చెట్టు మీదకో విసిరేశారు. ఈ భూపతులంతా చూస్తూ ఎలా ఊరుకున్నారు. ఏ కృష్ణుడూ అభయహస్తం ఇవ్వలేదా! ఏడ్చి ఏడ్చి వేసారిన నా భూమాత కనిపించకుండా పోయింది. ఎక్కడని వెతకను నా తల్లిని.




ఎటు చూసినా చెరువులే. వరిచేలన్నీ రొయ్యల చెరువులుగా మారిపోయాయి. భూదేవి కన్నీటితో నిండిన గుంటల్లా ఉన్నాయవి. మనుషుల స్వార్థ మనస్థత్వంలాగా నీచు వాసన వస్తూనే ఉంది.

నేనెంతో ఇష్టంగా తినే రొయ్యల వేపుడు చూస్తే కడుపులో దేవినట్టయింది. నా తల్లి పేగులన్నీ చుట్టబెట్టుకున్నట్టుగా ఉన్నాయవి.

ఆ రాత్రి వచ్చిన వెన్నెల నన్ను చల్లబర్చలేక పోయింది. తిరిగి అమెరికా వెళ్ళకూడదని అప్పుడే నిర్ణయించుకున్నాను. ఎంత ఖర్చయినాసరే. నేను అమెరికాలో సంపాదించిందంతా ఖర్చుపెట్టయినా సరే నా నేలతల్లికి చిలకపచ్చ చీర వేసి బహుమతిగా ఇవ్వాలని. అప్పటికి కాని నాకు శాంతి ఉండదు.